## క్లుప్తంగా

### వైస్ ఎంపీపీ ఎన్నికకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలించిన డీఎల్‌పీఓ సతీశ్

శంకర్‌పల్లి: మండల పరిషత్ ఉపాధ్యక్షుడి ఎన్నిక కోసం అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య గౌడ్ తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కురుమ రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో చేసిన ఏర్పాట్లను డీఎల్‌పీఓ సతీశ్ పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేక కుర్చీలను ఉంచారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### అమ్మ ఫౌండేషన్ ప్రచార బోర్డు ఆవిష్కరణ

కొత్తూరు: పట్టణంలో మంగళవారం అమ్మ మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ సంస్థ కార్యాలయాన్ని సీఐ నర్సింహ్మారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి శివకృష్ణగౌడ్ తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో సంస్థ ప్రచార బోర్డును ఆవిష్కరించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ తరఫునా సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ సారా వినయ్‌కుమార్‌గౌడ్, సభ్యులు రాజునాయక్, లతీఫ్, రఫీక్, రాజుగౌడ్, సంతోష్‌కుమార్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

### పల్స్ పోలియోను విజయవంతం చేయండి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్



మాట్లాడుతున్న దామోదర్

చేవెళ్ల: 3నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే పల్స్ పోలీయో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం చేవెళ్ల డివిజన్ కార్యాలయంలో డివిజన్‌లోని ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3నుంచి 5వ తేదీ సాయంత్రం 5గంటల వరకు పల్స్ పోలీయో చుక్కలను వేయనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పని సరిగా పోలీయో చుక్కలు వేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌హెల్త్ అధికారి డాక్టర్ స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన సంగమేశ్వర జాతర



సంగమేశ్వర దేవాలయంలో పూల అలంకరణలో స్వామి వారు

మొయినాబాద్ రూరల్: తీరొక్క పూలతో పాటు మొదుగు పూలతో సంగమేశ్వరుడిని అలంకరించారు. సంగమేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరలో చివరి రోజు స్వామి వారి దివ్య రథోత్సవంతో పాటు మహామంగళహారతి, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ పూజా కార్యక్రమాలను వేద పండితులు, ఆలయ పూజారులు సంగమేశ్వర గర్భగుడిలో శివలింగాన్ని వివిధ పూలతో అలంకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పూజలు నిర్వహించి మహామంగళహారతి అనంతరం నైవేద్యం, అన్నదానం చేశారు. జాతరలో చివరి రోజు కావడంతో భక్తుల సందడి నెలకొంది.

### శివదీక్ష ఎంతో పవిత్రమైనది

కొందుర్గు: శివ దీక్ష ఎంతో పవిత్రమైనదని గురుస్వామి భూపాలచారి సూచించారు. మంగళవారం చౌదరిగూడలోని చెన్నయ్య గృహంలో నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరిగూడ గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. అనంతరం గురుస్వామి భూపాలచారి మాట్లాడుతూ శివమాల ధరించిన భక్తులు 41రోజులు నియమనిష్టలతో స్వామివారిని ధ్యానిస్తే ముక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి బుచ్చయ్య పాల్గొన్నారు.



పడిపూజ చేస్తున్న శివస్వాములు

# రూ.100 కోట్లు కేటాయించండి

- చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్
- సీఎంకు వినతి పత్రం అందజేసిన పీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్



సభలో మాట్లాడుతున్న భీంభరత్

చేవెళ్ల: నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని పామెన భీంభరత్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. మంగళవారం చేవెళ్లలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల వద్ద జరిగిన భారీ బహిరంగ సభకు మొదట అధికారికంగా రెండు గ్యారంటీలను ప్రారంభించాలని అనుకున్నా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అది కాస్తా కాంగ్రెస్ సభగా మార్చారు. అయితే అధికార సభ అనే నేపథ్యంలోనే పెద్ద ఎత్తున జన సమీకరణ చేయటంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుంచి పెద్ద ఎత్తున జనం సభకు తరలిరావడంతో మొత్తం సభ కాంగ్రెస్ మయంగా మారింది. ఈ సభ దాదాపు రెండు గంటల పాటు సాగింది. ముందుగా సభావేదికపై ముఖ్యమంత్రి, మంత్రులు రాక ముందే స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ప్రసంగాలు మొదలు పెట్టారు. మంత్రులు వచ్చే లోపే వీరి ప్రసంగాలు ముగిశాయి. ప్రభుత్వ సపలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రులు పుష్పలీల, షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, తీగల క్రిష్టారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, అదిశ్రీనివాస్, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌లు మాట్లాడారు. ఈ సభలో మంత్రులు అందరూ కలిసి గంటలోపే వారి ప్రసంగాలు ముగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగమే దాదాపు అరగంటకుపైగా మాట్లాడారు. చేవెళ్ల సమస్యలపై పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తారణ పనులు చేపట్టాలని, మెడికల్ కళాశాల, ముడిమ్యాల ఫారెస్ట్‌లో ఐటీ కారిడార్ ఏర్పాటు, మెట్రో రైలు, ఆర్టీసీ డిపో, ప్రాణహిత ప్రాజెక్టు, చేవెళ్ల పార్లమెంట్ కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలని, జిల్లా ఉద్యమ సమయంలో నమోదైన కేసులు ఎత్తి వేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం పామెన భీంభరత్ మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై ఈ సభ నిర్వహించటం సంతోషకరమన్నారు. చేవెళ్ల సెంటిమెంట్ కాంగ్రెస్‌కి కలిసి వస్తోందన్నారు. చేవెళ్ల గడ్డపై తల పెట్టిన ఏ కార్యక్రమైనా విజయవంతమవుతుందని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకా ముందు చేవెళ్ల నుంచి చేపట్టిన పాదయాత్రతో విజయం సాధించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉండేలా అభివృద్ధి పనులకు రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, వెంకటస్వామి, సత్యనారాయణరెడ్డి, శైలజ, సమత, ఆగిరెడ్డి, సరిత, వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, దవల్‌గారి గోపాల్‌రెడ్డి, ఎర్ర గోపాల్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, వసంతం, దర్శన్, బల్వంత్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, యాదయ్య, పాండు, నర్సింలు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

## ముందుకు సాగని మురుగు కాలువలు



హైదరాబాద్–బీజాపూర్ రహదారి సమీపంలో చేరిన మురుగు

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు కరువు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చిన్నమంగళారంలో మురుగు కాలువ

మొయినాబాద్ రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్మించిన ఓపెన్ మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. ఈ మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగుచేరి ఎక్కడపడితే అక్కడ పేరుకపోతుంది. దీంతో ఇక్కడ దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో దుర్వాసన వెలువడుతోంది. మండల పరిధిలోని చిన్న మంగళారం, హిమాయత్‌నగర్, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, తోల్‌కట్ట, జీవన్‌గూడ, ఎన్కెపల్లి, బాకారం, వీరన్నపేట్, చాకలిగూడ, అప్పారెడ్డిగూడ తదితర గ్రామాల్లో గతంలో నిర్మించిన ఓపెన్ మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి సమీపంలో శివానగర్ మురుగు కాలువ ఏరులై పారుతుంది. ఇళ్లల్లోనుంచి మురుగు చేరి కంపు కొడుతుంది. ఈ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు, స్థానికులు ముక్కున వేలు వేసుకొని వెళ్తున్నారు. ఇక్కడ అపరిశుభ్రంగా ఉండడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాలబారినపడుతున్నారు. ఓపెన్ మురుగు కాలువల స్థానంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరినా అంతంత మాత్రంగానే చేపట్టారు. ఇప్పుడొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మొయినాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఓపెన్ మురుగు కాలువల స్థానాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి అభివృద్ధికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

కాంగ్రెస్ జిల్లా నాయకుడు రమేశ్



దేవాలయ ప్రారంభోత్సవంలో రమేశ్

మొయినాబాద్ రూరల్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి గోటికే రమేశ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో అంకెరమోనీ కిష్టమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని ప్రారంభించారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గోటికే రమేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాలతోనే ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో రజనీకాంత్, శంకర్‌గౌడ్, అంకరమోని శ్రీను, శంకర్, రమేశ్, ఈశ్వరమ్మ, షాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నమూనా ఎన్నికల నిర్వహణ



ఓటు వేసేందుకు లైన్లో నిలుచున్న విద్యార్థులు



ఓట్లు లెక్కిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్ రూరల్: మండల పరిధిలోని ఎలికట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నమూనా ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు ప్రాధాన్యం, ఎన్నికల నిర్వహణ, ప్రచారం, నాయకులను ఎన్నుకునే విధానంపై అవగాహన కల్పించారు. నమూనా ఎన్నికల్లో వార్డు సభ్యులుగా 20మంది విద్యార్థులు, ఇద్దరు సర్పంచులుగా పోటీ చేశారు. మిగిలిన విద్యార్థులతో ఓట్లు వేయించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను విద్యార్థులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సక్కుబాయి, ఉపాధ్యాయులు శ్రీదేవి, అరుణ, జ్యోతిలక్ష్మీ, గీతమ్మ, బుగ్గమ్మ, శిరీష, మోహన్‌బాబు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి



చేవెళ్ల: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశేశ్వర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన నలుగురికి రూ. 2,500ల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్య సేవలందించాలి

ఎంపీపీ సుకన్య

యాచారం: వైద్య వృత్తి దేవుడిచ్చిన వరమని ప్రాణాలను కాపాడటం అంటే అది వైద్యులకే సాధ్యమవుతుందని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొత్తగా 9మంది స్టాఫ్‌నర్స్‌లు వచ్చారు. వీరికి మంగళవారం ఆస్పత్రి కార్యాలయంలో స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ సుకన్య మాట్లాడుతూ.. వైద్య వృత్తిని గొప్పగా భావించాలని అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ఈ ఆస్పత్రికి అనేక గ్రామాల నుంచి పేదలు వస్తారని మెరుగైన వైద్య సేవలు అందించి, నాణ్యమైన మందులు అందజేసే విధంగా కృషి చేయాలని కోరారు. వైద్యురాలు రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

### క్రీడల్లో గెలుపోటములు సహజం

కాంగ్రెస్ నేత అభిషేక్ రెడ్డి



ట్రోఫీ అందజేస్తున్న మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

మంచాల: క్రీడల్లో గెలుపోటముల సహజమని ఓడిపోయినప్పుడు కుంగిపోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. ఆరుట్లలోని వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.20వేలు(స్పాన్సర్ జయంత్ గౌడ్) యువ సేన యూత్ గెలుచుకోగా.. రెండవ బహుమతి రూ.15వేలు (స్పాన్సర్ వెంకట రమణారెడ్డి) శ్రీరామ్ యూత్ గెలుచుకుంది. మూడవ బహుమతి రూ.10వేలు (స్పాన్సర్ చంద్రయ్య) పాండవ సేన–బి గెలుచుకోగా.. 4వ బహుమతి రూ.5వేలు (స్పాన్సర్ మార సురేష్) పాండవ సేన–ఏ టీం గెలుచుకుంది. మ్యాన్ ఆఫ్ దీ సిరీస్ రూ.2,222 (స్పాన్సర్ ఎన్నుదుల సురేష్)జి.పవన్, బెస్ట్ బ్యాట్‌మెన్ గణేశ్, బెస్ట్ బౌలర్ అదిల్‌ని ఎంపిక చేశారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, స్థానిక నాయకులు మానయ్య గౌడ్, హన్మంత్‌రెడ్డి, రాములు, భాషా, సుధాకర్, ఎల్లేశ్, రాజుగౌడ్, జంగయ్య గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వెంకట రమణారెడ్డికి సన్మానం



కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలలో నిర్వహిస్తున్న బీజేపీ విజయ సంకల్పయాత్రలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు మంగళవారం కలిశారు.బీజేపీ రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, జిల్లా ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధి లక్ష్మన్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలాల్ నాయక్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేశ్, నవీన్, శ్రీకాంత్, ప్రేమ్ కుమార్ నాయక్, రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికా బద్ధంగా చదివితేనే విజయం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచన లత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కాంచన లత

చేవెళ్ల: విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితేనే విజయం సాధించొచ్చని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కాంచన లత పేర్కొన్నారు. మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ మ్యాజిక్, బస్ ఫౌండేషన్ ఇండియాతో కలిసి ఉద్యోగ సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కావాల్సిన నైపుణ్యం, కెరీర్ ప్లానింగ్‌పై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యా, ఉద్యోగాల విషయంలో ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్వ్యూలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, ఫౌండేషన్ స్కిల్స్ ట్రైనర్ ఎలిషేబా, కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ రూప్న రవీంద్రన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య



విద్యార్థినులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న చెన్నయ్య

షాద్‌నగర్: ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిన చెన్నయ్య పేర్కొన్నారు. షాద్‌నగర్ శివారులోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం జపాన్‌కరాటే అసోసియేషన్ ఇండియా షోటోఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎత్తిన చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో యుద్ధ విద్యలు కూడా నేర్చుకోవడం అంతే ముఖ్యమన్నారు. ఆపద కాలంలో శత్రువుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఇవీ ఎంతో ఉపయోగపడతాయన్నారు. బయటికి వెళ్లే అమ్మాయిలు, యువతులు ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతుంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇలాంటి విద్యలను విధిగా నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. శశిరేఖ బ్లాక్ బెల్టు, ఇస్లావత్ గీతా బ్లూ బెల్టు, కొత్త ఐశ్వర్య గ్రీన్ బెల్టు సాధించినట్లు చెన్నయ్య తెలిపారు. పరీక్షల్లో సత్తా చాటిన వారికి బెల్టులు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు రాజ్యలక్ష్మి, ఆశాజ్యోతి, శ్రావణి, రజని, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## శంకరయ్యకు అండగా ఉంటాం

శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైటర్ శ్రీనివాస్‌రెడ్డి



శంకరయ్యతో శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి

తలకొండపల్లి: శంకరయ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైటర్ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన బోడ శంకరయ్యకు రెండేళ్ల కితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి వికలాంగుడయ్యాడు. అప్పటినుంచి శంకరయ్య మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి.. శతాబ్ది టౌన్‌షిప్ ప్రొప్రైటర్ శ్రీనివాసురెడ్డికి వివరించారు. స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్షా 20వేలు వెచ్చించి జైపూర్ నుంచి కృతిమ కాలు తెప్పించి వైద్యుల సహకారంతో శంకరయ్యకు అమర్చారు. ప్రస్తుతం శంకరయ్య కోలుకొని నడుస్తున్నాడు. మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి.. శంకరయ్యను కలిసి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని భరోసా పలికారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, జగ్గారెడ్డి, యాదయ్య, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో అవేర్ సంస్థ, పెన్షనర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చింది. కామినేని, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు వర్ష, తేజస్విని, ప్రసన్నకుమార్, అశోక్‌రాజ్, దేవేందర్, జోత్స్న, అనుష, జ్యోతిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమంకోసం తమ సంస్థ ఆధ్వర్యంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు, జనార్దన్, సరాపు జగదీశ్వర్, దుగ్గు శేఖర్, సత్యనారాయణ, నర్సింలు, నాగేశ్వర్, స్వరాజ్‌బాబు, రమాదేవి, షబ్బీర్, బండారి శంకర్, మాణిక్యం, గోపాల్ రావు, నక్క బాల్‌రాజ్, రాము, తదితరులు పాల్గొన్నారు.



## పాడిపశువుల పెంపకంతో అదనపు ఆదాయం

షాబాద్: రైతులు మిశ్రమ వ్యవసాయ పద్ధతితో పాటు పాడి పశువులను పెంచి అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని డాక్టర్ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. పాడి రైతులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా క్రీడ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తిరుమలాపుర్, రేగడి దోస్వాడ, ముద్దేంగూడలో నిర్వహించిన సమావేశంలో ఉచితంగా దాణా, మినరల్ మిక్సర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయంతో పాటు 1 లేదా 2 పాడి పశువులను పెంచడమనేది అనాదిగా వస్తున్న పద్ధతి అని చెప్పారు. వ్యవసాయంలో పంట నష్టం జరిగినప్పుడు, తగినంత వర్షపాతం లేకపోవడంతో తెగుళ్లు, వ్యాధుల వలన పాడైపోయినప్పుడు రైతులకు పాడి పశువుల నుంచి వచ్చే ఆదాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి పట్టణ ప్రాంతాలలో, గ్రామీణ ప్రాంతాలలో ఈ పాడి పరిశ్రమ ప్రధానమైన వృత్తిగా చేసుకుంటున్నారన్నారు. కాబట్టి పాడిపశువుల పెంపకం, పోషణ, యాజమాన్యం, పశుగ్రాసాల సాగు, వ్యాధి నివారణ, తదితర విషయాలు ముందుగా తెలిసి ఉండాలి. పాడి పశువుల యాజమాన్యం గురించి సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రామకృష్ణా, కార్గిల్ కంపెనీ ప్రతినిధి సుమన్, వెటర్నరీ మైక్రో లాబ్స్ కంపెనీ ప్రతినిధులు శంకర్, వెంకటేశ్, పాషా, సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం పాడి రైతులు ప్రవీణ్, సుదర్శన్, మాధవరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఉచితంగ దాణా, మినరల్ మిక్సర్ పంపిణీ చేస్తున్న అధికారులు